క్లుప్తంగా

ఎస్సైలను కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లిలో ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు శ్రావణ్ కుమార్, సంధ్యారాణిలను పట్టణ స్వర్ణకార సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైలను కలిసిన వారిలో భూపాలపల్లి పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కటుకోజ్వల రాజు, ప్రధాన కార్యదర్శి కొండపర్తి శ్రీనివాస్, కోశాధికారి రామోజు బ్రహ్మం, సహాయక కార్యదర్శి మునిగంటి రాజేందర్, కొండపాక శంకర చారి, రమేష్, గుగ్గిళ్ల నాగేశ్వరావు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నియామకం



భూపాలపల్లి రూరల్: జిల్లా జాగృతి పీఆర్ఓగా పట్టణానికి చెందిన గాజుల అరుణ్‌ను నియమించినట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరుణ్‌కు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన జాగృతి నాయకులకు అరుణ్ కృతజ్ఞతలు తెలిపారు.

విరాళాల సేకరణ



ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ మేరకు సోమవారం గోవిందరావుపేట మండలంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సిరిపెల్లి జీవన్ విరాళాలు సేకరించారు. వరద కారణంగా పస్రా గ్రామంలోని ఎస్సీ కాలనీ , ప్రాజెక్టునగర్‌లో నష్టపోయిన ప్రజలకు దాతలు అండగా నిలవాలని కోరారు. బాధితులకు సాయం అందించేందుకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంజయ్, రాజు, యశ్వంత్, నాగరాజు, జశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండలంలోని జగన్నాథపురం జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు వచ్చిపోయే వాహనాల్లో సోదాలు చేశారు. వాజేడు, భద్రాచలం రహదారిపై వచ్చి వెళ్లే వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జాబితాను ప్రకటించాలి



ములుగు : డబుల్ బెడ్రూం అర్హుల జాబితాను ప్రకటించాలని ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు మంజుల భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని జాతీయ రహదారిపై సోమవారం నిరుపేదలతో కలిసి ధర్నా చేపట్టారు. దీంతో వాహణాలు భారీగా నిలిచి పోవటంతో సీఐ రంజిత్ కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డిలు అక్కడకు చేరుకొని ధర్నాను విరమింపజేశారు. అనంతరం భిక్షపతిగౌడ్ మాట్లడుతూ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం, లక్ష్మి, ఝాన్సీ ఉన్నారు.

స్వగ్రామాలకు తరలింపు



ఏటూరునాగారం: మండలంలోని ఎలిశెట్టిపల్లి, అల్లంవారిఘణపురం గ్రామాల వరద బాధితులను సోమవారం చెల్పాకలోని పునరావాస కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు పడవలో తరలించారు. ఈనెల 5వ తేదీ నుంచి పునరావస కేంద్రాల్లో తలదాచుకున్న ముంపు ప్రాంతాల ప్రజలు ఇళ్లకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందిలేదని గుర్తించిన అధికారులు మళ్లీ వారిని సురక్షితంగా స్వగ్రామాలకు తరలించారు. ఎలిశెట్టిపల్లి వద్ద ఉన్న జంపన్నవాగు తగ్గడంతో వారిని తరలించినట్లు కార్యదర్శి సందీప్‌తెలిపారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



కాటారం: కిశోరామృతం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, రజిత

కాటారం: తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, రజిత తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ధన్వాడలో తల్లిపాలు, పిల్లల పోషణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని ఎలాంటి ద్రవపదార్థాలు తాగించవద్దన్నారు. పిల్లలకు అవసరమైన విటమిన్స్, మినరల్స్ తల్లిపాలలోనే ఉంటాయన్నారు. అనంతరం కిశోరామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజన, నక్షత్రా, ఆశా కార్యకర్త సంధ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల, పెద్దతూండ్ల గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి తల్లిపాలపై అవగాహన కల్పించారు నిర్వహించారు. తల్లిపాలతోనే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దతూండ్ల సర్పంచ్ విజయ, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న రాజమల్లయ్య

కాటారం: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ మీసా రాజమల్లయ్య సూచించారు. కాటారం మండలం కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు నిర్వహించారు. అంతకముందు ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతికి సంతాపంగా నివాళులర్పించి మౌనం పాటించారు. అనంతరం రాజమల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాల అనుగుణంగా బోధన చేయాలని తెలిపారు. తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యం, విద్యార్థుల్లో అభ్యసన మెలుకువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. గత ఏడాదిలాగే ఈ ఏడాది ఫలితాల్లో మండలాన్ని జిల్లాలో ముందు స్థానంలో నిలపడానికి సమిష్టి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు రాజు, పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సత్యం, మోహన్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: జిల్లా కేంద్రంలోని స్థానిక రాఘవేంద్ర ఉడిపి హోటల్ వద్ద జరిగిన ఇసుక లారీ ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఈ ప్రమాదం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, అధికారుల నిర్లక్ష్యంతోనే జరిగిందని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం యథేచ్ఛగా భూపాలపల్లి టౌన్ లోనికి ఇసుక లారీలను అనుమతించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. పట్టణంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారడం కూడా ప్రమాదానికి కారణం అని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఇసుక మాఫియా జిల్లాలో యథేచ్ఛగా సాగుతుందని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఆకుతోట కుమారస్వామి, ముఖ్య నాయకులు క్యాతరాజు రమేష్, నీరటి మహేందర్, ఎండి రఫీ, వనపాకల ప్రసాద్ వెల్దండి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

అధిక సాంద్రత పత్తి పంటతో మేలు



భూపాలపల్లి రూరల్: పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భూపాలపల్లి రూరల్: పత్తి పంటను అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకుంటే రైతులకు మేలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన సంస్థానం శాస్త్రవేత్తలు రామ్ ప్రసాద్, వీరన్న, మధు సూచించారు. సోమవారం భూపాలపల్లి మండలంలోని కొంపల్లి గ్రామంలోని పత్తి పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. పత్తిలో రసం పీల్చే పురుగులైనా పేనుబంక, పచ్చదోమ, పిండినల్లి నివారణకు మోనోక్రోటోఫాస్ 2 మి.లీ 1 లీటరు నీటికి, ఎసీఫేట్ 1.5 గ్రాములు1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పత్తిలో సన్న గడ్డి వెడల్పాటి గడ్డి నిర్మూలనకు 1లీటరునీటిలో క్విజలోపాప్ ఈథైల్ లేదా లీటర్ నీటికి 1.25ఎం.ఎల్‌ల ప్రొపాక్విజపాప్, పైరితయోబాక్ సోడియంను 1లీటర్ నీటిలో 1.25 మిలీలను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పెరుగుదల కుంటిపడిన పత్తి పంటలో 25 కేజీల యూరియా, 15కేజీల పొటాష్ వేసుకోవాలని, 19.19.19 లను లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున వారానికి రెండు సార్లు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏఓ సతీష్, ఏఈఓ కల్యాణ్ తదితర రైతులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పలు ప్రాంతాల్లోని పత్తి పంటలను పరిశోధన కేంద్రం వరంగల్ శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. అనంతరం రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు వీరన్న, రాంప్రసాద్, మధు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి



సూచనలు చేస్తున్న పోలీసులు

టేకుమట్ల: మండలంలోని టేకుమట్ల, రాఘవారెడ్డిపేట గ్రామాల మధ్య గల చలివాగు పైన బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ గ్రామాలకు రవాణ సౌకర్యం నిలిపి వేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే చేపలకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని చలివాగులో మోసళ్లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సన్మానం



నయీంను సన్మానిస్తున్న సీఐ కిరణ్

మహదేవపూర్: మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో 36 సంవత్సరాలుగా హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవి విరమణ పొందిన నయీంను సీఐ కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజ్‌కుమార్, లక్ష్మణరావు, తమాష రెడ్డి, చల్ల రాజు, భవాని సేన్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న ఎస్సై సుధాకర్

మల్హర్(మహాముత్తారం): మండలంలోని మహాముత్తారం, కొత్త మహాముత్తారం గ్రామల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌ను అడవి ముత్తారం ఎస్సై దాసరి సుధాకర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ బ్యాగ్ ఛాలెంజ్-2023 పిలుపు మేరకు దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే 111 మంది గ్రామీణ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌ను బహుమతిగా అందించినట్లు తెలిపారు. స్కూల్ బ్యాగ్ ఛాలెంజ్ 2023 ఛాలెంజ్ రైజర్, సీఆర్పీ జవాన్ మనోహర్, ఇతర పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయురాళ్లు శ్రీదేవి, కవిత పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే 'ఆరోగ్యశ్రీ'



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఉద్యమ ఫలితంగానే ఆరోగ్యశ్రీ అమలైందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బట్టు విజయ్‌కుమార్ మాదిగ తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం అవతరించిన రోజు ఆగస్టు 7ను పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బట్టు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే అసెంబ్లీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీని అమలు చేశారన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో పేద, ధనిక కులం మతం తేడా లేకుండా లక్షలాది మందికి లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్, ఎంఎస్పీ నాయకులు అంతడుపుల సురేష్, దోర్నాల రాజేందర్, భరత్, చిలివేరి పవన్, మంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాటారం/పలిమెల/మహదేవపూర్: నిరుపేదలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కాటారం, పలిమెల తహసీల్దార్లు నాగరాజు, స్రవంతి, మహదేవపూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణ శుక్రవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10లోపు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఇంటి ఖాళీ స్థలంకి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒక వేళ దివ్యాంగులు అయితే ధ్రువీకరణపత్రం జత చేయాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాల్వ గండ్లను పూడ్చాలి

ములుగు రూరల్: వరద కారణంగా లక్నవరం కాల్వకు గండ్లు పడడంతో రైతులు పంట సాగుకు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గండ్లను పూడ్చాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కాల్వకు గండ్లు పడడంతో పంట సాగుకు ఆలస్యమవుతుందన్నారు. వరద మూలంగా నాట్లు వేసిన పంట పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి టెండర్లు కాకుండా నామినేషన్ పద్ధతిలో పనులను కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కాల్వ మరమ్మతు పనులు మూడు రోజుల్లో ప్రారంభించని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంకట్‌రెడ్డి, రామస్వామి ఉన్నారు.

గడువు పెంచండి

ఎస్ఎస్ తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ వరకు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే వీలు ఉందని తెలిపారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో మారుమూల ప్రాంతంలోని రోడ్లు ధ్వంసమై రవాణా సౌకర్యానికి అంతరాయం కలిగిందన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన లింగాల, బంధాల గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేదన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ స్పందించి దరఖాస్తు గడువు పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ చైర్మన్ పాక సాంబయ్య ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



జీపీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని ఇబ్రహీంపల్లిలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని సోమవారం ఎంపీడీఓ పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలు చేశారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు. పీఆర్ ఏఈ అశోక్, నాయకులు దబ్బెట రాజేశ్, చినాల బ్రహ్మరెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

మొగుళ్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె సోమవారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగులు, అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం కృష్ణయ్య, వెంకటేష్, సుధాకర్, కొమురయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

వాజేడు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకృత్యాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. దేశంలో ఆదివాసీలకు కనీస రక్షణ కరువైందని విమర్శించారు. మణిపూర్‌లో మూడు నెలలుగా కుకి, నాగ తెగల గిరిజనులపై మైతే కులాల వారు అమానవీయ చర్యలకు యవత్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైందన్నారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన ఫారెస్టు కంజర్వేటివ్ చట్టం 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాల ఉల్లంఘనే అవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 11 గిరిజనేతర కులాలను గిరిజనుల్లో కలపాలని శాసన సభ తీర్మానం చేయడం చారిత్రాత్మిక తప్పిదమని ఆరోపించారు. ఆదివాసీలపై చిన్నచూపు చూస్తే సహించేది లేదన్నారు. ఈనె 9వ తేదీన ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఏజెన్సీలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు చంత సోమరాజు, పూనెం రామచందర, నర్సింహమూర్తి, సతీష్, మల్లికార్జున్, పాపారావు, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా దాతలు



సరుకులు పంపిణీ చేస్తున్న అయిల్ కంపెనీ ప్రతినిధులు



దుస్తులు పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: వరద ముంపునకు గురైన బాధితులకు దాతలు అండగా నిలుస్తున్నారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి వరద బాధితులకు ఫ్రీడం సన్ ఫ్లవర్ అయిల్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లకిడె కమలబాయి, సన్ ఫ్లవర్ అయిల్ కంపెనీ ఏఎస్ఎంలు రమేష్, రంజిత్ భూపాలపల్లి జిల్లా వర్తక సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరావు, సంఘం నాయకులు రాంచెందర్, వెంకటేశ్, రమేష్, భాస్కర్, రవీందర్, దామోదర్ పాల్గొన్నారు.

రెడ్డి గాండ్ల సంఘం నాయకుల ఆధ్వర్యంలో..

భూపాలపల్లి రెడ్డి గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామంలో వరద బాధితులకు సోమవారం చీరెలు, దుస్తులు, పంపిణీ చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిత కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోషం పోచిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



కాటారం: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని దేవరాంపల్లిలో సోమవారం చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే దేవరాంపల్లికి చెందిన శ్రీనివాస్(40) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం తాగి సైకోగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధ రాత్రి మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.